

# సామాజిక మాధ్యమం - మొగ్గలు కవిత్వం

ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రజాదరణ కల్గింది వచన కవిత్వం. గతంలో కొద్దిమంది కవుల వరకే పరిమితమైన వచన కవిత్వం ప్రసార, ప్రచార సాధనాలు ఎక్కువ కావడంతో ఇపుడందరూ కవిత్వం విరివిగా రాస్తున్నారు. ఒకప్పుడు పత్రికలలోనే వచ్చే కవిత్వం ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా వస్తుంది. విభిన్నమైన శైలితో, వైవిధ్యమైన వస్తువులతో కవితలు నూతనత్వాన్ని సంతరించుకుని కొత్త తరాన్ని ఆకట్టుకుంటు న్నాయి. సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఆన్‌లైన్ పత్రికలు, వెబ్ మ్యాగజైన్‌లు వంటి వాటిల్లో కవిత్వం తామర తుంపరగా నిత్యం వికసిస్తూనే ఉంది. ఈ మాధ్యమాల్లో వచన కవిత్వంతోపాటు వివిధ మినీ కవితలు, నానీలు, రెక్కలు, నానోలు, వ్యంజకాలు, గజళు, రుబాయిలు, పద్యాలు వంటివి అప్రతిహతంగా వస్తున్నాయి. వీటికి తోడు తెలుగు సాహిత్యంలో నూతనంగా ఆవిర్భవించిన వచన కవితా ప్రక్రియ 'మొగ్గలు' కూడా విరివిగా వివిధ మాధ్యమాల్లో విరబూస్తున్నాయి.

ఆధునిక నూతన వచన కవితాప్రక్రియ అయిన మొగ్గలు మూడు పాదాల కవిత్వం. ఈ మొగ్గలు 2017 సెప్టెంబర్‌లో పురుడు పోసుకుంది. ఇందులోని మొదటి రెండు పాదాలు ఏదేని ఒక విషయాన్ని అర్థవంతంగా, భావయుక్తంగా చెబితే మూడవపాదం దానికి కొనసాగింపుగా ఉంటుంది. అంటే మొదటి రెండు పాదాలు సంశ్లిష్ట వాక్యంలా ఉంటుంది. మూడవ పాదం మొదటి రెండు పాదాలను బలంగా ఆవిష్కరించే సమర్థింపు పాదం. మొదటి రెండు పాదాలను బలంగా ఆవిష్కరించే సమర్థింపు వాక్యం. ఈ మూడవ పాదం ఒక రకంగా నినాదంగా, సూక్తిగా ఉంటుంది. ఈ 'మొగ్గలు'కు ఎలాంటి అక్షర నియమం లేదు. ఛందస్సు లేదు. అందుకే వీటిని కవులు ఆదరిస్తున్నారు. అలవోకగా 'మొగ్గలు'ను పూయిస్తున్నారు.

ఈ 'మొగ్గలు' ప్రారంభమే సామాజిక మాధ్యమంలో విరబూయడం విశేషం. మొదటగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల్లో 'మొగ్గలు' వికసించాయి. అనంతరం పత్రికలలో, ఆన్‌లైన్ పత్రికలలో 'మొగ్గలు' పరిమళాలను వెదజల్లాయి. ప్రస్తుతం 'మొగ్గలు' ప్రముఖ దిన, వార, మాస పత్రికలలోనే కాకుండా సామాజిక మాధ్యమాలలో ప్రతిరోజూ వికసిస్తున్నాయి. ఇప్పటికే శతాధిక కవులు 'మొగ్గలు'ను పూయించారు. ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ కల్గిన కవితా ప్రక్రియగా 'మొగ్గలు' రికార్డు సృష్టించగలిగింది. వర్ధమాన కవులనుంచి ప్రముఖ కవుల దాకా 'మొగ్గలు'ను రోజూ పూయిస్తూ కవితాసేద్యం చేస్తున్నారు. ఇది చినుకులా ప్రారంభమై వరదలా సామాజిక మాధ్యమాలలో ముంచెత్తుతున్నది. కవుల ఆదరణతో మొగ్గలు నిత్యం పరిమళిస్తున్నాయి. ఈ 'మొగ్గలు' సులువైన ప్రక్రియ కావడంతో కవులు విరివిగా రాస్తున్నారు. వస్తువైవిధ్యంతో, నూతనమైన అభివ్యక్తితో 'మొగ్గలు'ను పరిమళింపజేస్తున్నారు. ఇప్పటికీ కవులు ఒక్కొక్కరు శతాధిక 'మొగ్గలు'ను పూయించారు. రోజొక అంశంతో కవితా 'మొగ్గలు'ను పూయిస్తున్నారు. సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఆన్‌లైన్ పత్రికలు మొదలైన వాటిలో 'మొగ్గలు' కవిత్వాన్ని పరామర్శిద్దాం.

వాట్సాప్ కవిత్వం

'మొగ్గలు' మొదటగా పురుడు పోసుకుంది వాట్సప్ సమూహంలోనే. అనంతరం మిగతా మాధ్యమాల్లో తన ప్రస్థానాన్ని కొనసాగించింది. కొనసాగిస్తున్నది. వాట్సాప్ సమూహంలో ప్రత్యేకంగా 'మొగ్గలు' అనే ప్రత్యేక గ్రూపు వున్నది. ఇందులో ప్రతిరోజూ 'మొగ్గలు' విరబూస్తున్నాయి. పదికి తక్కువ కాకుండా 'మొగ్గలు' పూస్తున్నాయి. రోజుకొక ప్రత్యేకాంశంతో ఈ మొగ్గలు వికసిస్తున్నాయి. సామాజిక మొగ్గలే కాకుండా ప్రకృతి, దేశభక్తి, దైవభక్తి, రైతు, పల్లె, ప్రేమ, చెరువు, రాత్రి, పండుగ వంటి మొగ్గల కవిత్వాన్ని కవులు నిరంతరం నూతనంగా ఆవిష్కరిస్తున్నారు. ఇలా వైవిధ్యమైన అంశాలతో మొగ్గలు విరబూస్తు న్నాయి. నేను రాసిన మొగ్గ.

భూమిలో ఎన్ని రోజులని ఉంటుంది విత్తనం
ఎపుడో ఒకసారి మొలకెత్తాల్సిందే
చైతన్యం దాని జీవ లక్షణం

భూమిలో విత్తు ఉండేది కొన్ని రోజులే. అదెప్పటికైనా మొలకెత్తక తప్పదు. చైతన్యమే విత్తు లక్షణం. మొలకెత్తడమనేది విత్తు సహజ లక్షణం. చైతన్యానికి ప్రతీక విత్తు. ఇందులో మొదటి రెండు పాదాలు విత్తు గురించి చెప్పబడింది. మూడవ పాదం దానిని సమర్థించే వాక్యం. ఇది మొగ్గలు కవితా ప్రక్రియ లక్షణం.

ఎన్ని అక్షరాలను పదాలుగా కూర్చానో
మొగ్గలను కవితా ప్రభలుగా వెలిగించ డానికి
మొగ్గలు నింగిలో మెరిసే అక్షర నక్షత్రాలు

మొగ్గలు గురించి రాసిన కవిత ఇది. అక్షరాలు పదాల తోరణమవుతుంది. కవితను వెలిగించే దీపికవుతుంది. ఆకాశంలోని నక్షత్రాల్లా మొగ్గలు మెరుస్తుంటాయని మూడవ పాదంలో అర్థవంతంగా చెప్పబడింది. మొదటి రెండు పాదాలు మొగ్గలు ఎలా వెలుగుతాయో చెప్పబడగా, మూడవ పాదం దానిని సమర్థించేదిగా ఆవిష్కరించబడింది.

యువకవి బోలయాదయ్య ప్రతిరోజు 'మొగ్గలు'ను పూయిస్తున్నారు. 'మొగ్గలు' గురించి రాసిన మొగ్గ ఇది.

మది అద్దంలో అక్షరాలను అద్దితేనే
అపురూప ప్రక్రియకు ప్రాణం పోశాయి
'మొగ్గలు' నిత్యం వికసించే పుష్పాలు

'మొగ్గలు' ప్రాణం పోసుకున్న తీరుకు అద్దం పట్టిన మొగ్గ ఇది. మదిలోని ఆలోచనలకు ప్రతిరూపమే అపురూప ప్రక్రియ ఆవిర్భావమని మొదటి రెండు పాదాల్లో చెప్పగా, మూడవ పాదంలో 'మొగ్గలు' నిత్యం వికసించే పుష్పాలుగా అర్థవంతంగా చెప్పబడింది.

ప్రముఖ కవి కోట్ల వేంకటేశ్వర రెడ్డి రాసిన మొగ్గలో.

దాచుకున్న ముఖాన్ని పసిగట్టనిదే
లోకం అసలు రంగు బయటపడదు
కవీ ! నీది రవికాంచని చూపు

అంటాడు. బలమైన కవిత్వం రాసేవారిలో కోట్ల ఒకరు. మనిషిలో అనేక ముఖాలు అంతర్ముఖాలు. అవి కనబడవు. కానీ కవికి మాత్రమే సాధ్యమంటాడు. ఈ మొగ్గలో మనిషి అసలైన అంతర్ముఖం ఎప్పుడో ఒకసారి బయటపడాల్సిందే. అలా బయటకు తీసుకువచ్చేవాడు కవి అన్న ధ్వని ఈ మొగ్గలో ప్రతిబింబించింది. ఇలాంటి మొగ్గలు కోట్ల కలం నుంచి అనేకం వెలువడ్డాయి.

ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య అనేక 'మొగ్గలు'ను వికసింపజేశారు. చెరువు గురించి రాసిన ఈ మొగ్గలో

ఊరూరా చెరువు నిండుపున్నమిలా నవ్వితేనే
పల్లె జీవనం కొత్తపుంతలు తొక్కేది
చెరువులే బతుకుదెరువుకు భరోసా

అంటాడు. ఊరూరా చెరువులు నిండితేనే బతుకులు బాగుపడుతాయన్నంటాడు. మూడవ పాదం చెరువులే బతుకు దెరువుకు భరోసా అన్నది నినాదంగా, సూక్తిగా ఆవిష్కరించడం విశేషం. ఇలాంటి మొగ్గలను వనపట్ల చాలా ఆవిష్కరించాడు.

ప్రతి నిత్యం మొగ్గలు రాసే కవయిత్రి టి.అంబుజ. రోజొక కొత్త అంశంతో మొగ్గలను పూయిస్తుంది.

చదువులమ్మ ఒడిని చేరితేనే కదా
సకల విద్యలను నిత్యం అభ్యసించేవి
విద్యతోనే వినయం అలవడేది

చదువులమ్మ ఒడి అయిన బడిలో చేరితేనే అనేక విద్యలను నేర్చుకునేది. అలా ప్రతినిత్యం ఏదో నేర్చుకుంటేనే విద్య అలవడుతుంది. ఇలాంటి విద్యవల్లనే వినయం అలవడుతుం దనేది పై మొగ్గ సారాంశం.

ప్రముఖ కవి శ్రీదాస్యం లక్ష్మయ్య అనేక 'మొగ్గలు'ను రచించారు.

మంచి పుస్తకం చదివినప్పుడల్లా
మనసు తేలికవుతూనే ఉంటుంది
కవిత్వం చదివితేనే మనసు హాయి

వాస్తవాన్ని పట్టిచూపిన మొగ్గ ఇది. మంచి పుస్తకం చదివితే ఎవరికైనా మనసు తేలికవుతుంది. కవిత్వం కూడా అంతే. మనసును హాయిగొల్పుతుంది. మంచి సందేశాత్మక మొగ్గ లక్ష్మయ్య కలం నుండి జాలువారింది.

**నిత్యం కవిత్వం రాస్తున్న మెట్టా నాగేశ్వరరావు ఉగాదిపై మొగ్గలును రచించాడు.**

**తియ్యగా జీవితం ఉండాలని అత్యాశపడ తానా**
**చేదుగా ఉండటం చూశాక కలవరం దుతాను**
**చీకటి దాటకుండా వెలుగులేదంటది ఉ గాది పదార్థం**

ఉగాది సందేశాన్ని వినిపించాడు ఈ మొగ్గలో కవి. షడ్రుచుల ఉగాది జీవితానికి పరమార్థమన్న సందేశాన్ని ఇందులో మెట్టా చాటాడు.

ఉస్మానియా పరిశోధకుడు ఐ.చిదానందం అనేక 'మొగ్గలు'ను ఆవిష్కరించాడు.

నేత్రాలు నందనవనం అయినప్పుడల్లా
పుస్తకాలన్నీ పారిజాత పరిమళాలే అవుతాయి
మనిషిలో మస్తిష్కజ్ఞాన తరంగాలు పుస్తకాలు

పుస్తకాలు జ్ఞాన తరంగాలంటూ ఆవిష్కరించిన కవిత ఇది. నేత్రాలు నందనవనమైతేనే పుస్తకాలు పారిజాత పరిమళాలన్న అద్భుతమైన కవిత్వాన్ని చిదానందం చక్కగా ఆవిష్కరించాడు. నిజమే పుస్తకాలన్నీ పారిజాత పరిమళాలే. ఇంకా ఇలాంటి మొగ్గలను చాలామంది రాశారు. రాస్తున్నారు. ఈ వాట్సాప్‌లోని అనేక సమూహాల్లో ఈ 'మొగ్గలు' ప్రతిరోజు విరబూస్తూన్నాయి. 'మొగ్గలు'సమూహంతో పాటు, పిల్లలమర్రి, జాతీయ సాహిత్య పరిషత్, తెలంగాణ సాహితి, పాలమూరు పత్రిక, పాలమూరు సాహితి, తెలుగు పూలతోట, సాహితీ కళాభారతి, బాటసారి, పాలమూరు ఉపాధ్యాయ, స్నేహం, పొయెట్రీ కవిత్వం, పోయెట్స్, 157 పోయెట్స్, తెలుగు ప్రపంచ మహాసభలు, యాదాద్రి - వరంగల్ అర్బన్, తెలంగాణ సాహితి వనం, ఉపాధ్యాయ బంధువు, బిసి చైతన్య వేదిక, సాహితీ సౌరభాలు, పాలమూరు భక్తి సుధ, పెన్ పవర్, సాహితీ శిల్పాలు, సెరెన్ సాహితీ, సహస్ర కవుల దిక్సూచి, జాగృతి సాహిత్యం, తెలంగాణ తెలుగు పండితులు, కందనూలు జిల్లా కవులు, సిపి బ్రౌన్ గ్రంథాలయం, తెలుగు సాహిత్య పరిశోధకులు, మెట్టప్రాంత సాహితీసంగమం, కుటుంబం, మరో మహోదయంకై నేను సైతం, సాహితీ సుధా వేదిక, కవన విజయం, షిరిడీ కవితోత్సవం, సకలజన సేవాసమితి, స్వర్ణ సాహిత్య సౌరభ వేదిక, పాలమూరు టీచర్స్, పసిడి తెలంగాణ మాసపత్రిక, జంటనగరాల రచయితల సంఘం, కవి(తా) మిత్రబృందం, విత్తనాలు, పాలమూరు ప్రోగ్రెసివ్ ఫోర్స్, వేముల మిత్రులు, ఫ్యామిలీ, గురువులు ఆచార్యులు, టిపోపా వంటి 50కి పైగా సాహితీ సమూహాలలో 'మొగ్గలు' వినూత్నంగా ఆవిష్కరించబడుతున్నాయి. ప్రతిరోజు పై సమూహాలన్నీ 'మొగ్గలు' ప్రసారమై ప్రజల మన్ననలను పొందుతున్నాయి.

ఇంకా ఈ 'మొగ్గలు'ను బాదేపల్లి వెంకటయ్య గౌడ్, వి.పుష్పలత, పులి జమున, ఈవేమన, ధనాశి ఉషారాణి, సర్ఫరాజ్ అన్వర్, కొప్పోలు యాదయ్య, జ్యోతి, నెల్లూరి విజయలక్ష్మి, నాగమోహన్ ఎలిశాల, కె.పి.లక్ష్మీనరసింహ్మ, సైదులు ఖేతావత్, అనుశ్రీ, ఆకుల రవివర్మ, బి.సురేందర్, రూప, చామర్తి అరుణ, శ్రీ దాస్యం లక్ష్మయ్య, తండ హరీశ్‌గౌడ్, డా.తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి, జ్యోతి, అఖిలాశ, శోభ, పుట్టి గిరిధర్, ఈడెల్లి రాములు, జకులపల్లి గోపాల్, డా॥గుంటి గోపి, గుంటి గోపిలత, నందిగామ కిషోర్, మేడిచర్ల హరినాగభూషణం, పొన్నగంటి ప్రభాకర్, జంపని శ్రీనివాసమూర్తి, జయ హన్మంత్ నాయక్, కోడెం సాంబయ్య, కొక్కె రాములు, పుచ్చా కుమారస్వామి, మొగళ్ళ కురుమయ్య, పి.నాగజ్యోతి శేఖర్, ఎస్.నరేశ్ గౌడ్, చంచల రవి, మానస ఓర్సురాజ్, బొడ్డుపల్లి రాజ్‌కుమార్, సృజామి, సుధీంద్ర భార్గవ, మర్యాద సురేందర్ రెడ్డి, సుమాల హన్మంతు, మద్దిలేటి కల్వకోలు, సత్యం వడిచర్ల, జి.శాంతారెడ్డి, వెన్నెల సత్యం, మెట్టా నాగేశ్వర రావు, తెలుగు తిరుమలేశ్, యం.వనజ, రావూరి వనజ, వడ్ల వెంకటేశ్, కోలంట్ల రామకృష్ణ, ఉప్పరి తిరుమలేశ్, దార్ల రాఘవేంద్రాచారి, నంద్యాల విజయలక్ష్మి, నాగరాజు యాదగిరి, పి.కృష్ణవేణి, మన్నె లలిత, మేడిశ్రీ, బండికాడి అంజయ్య గౌడ్, సిరిమల్లెలు వంటి వారు విరివిగా రాస్తున్నారు.

ఫేస్‌బుక్ కవిత్వం

వాట్సాప్ సమూహంలోనే కాక ఫేస్‌బుక్‌లో కూడా మొగ్గలు కవిత్వం విరిగా వస్తుంది. ప్రధాన విభాగంలోనే కాక మొగ్గలు, కవిసంగమం, పిల్లలమర్రి, కవి సమ్మేళనం సాహిత్య వేదిక వంటి సమూహాలలో కవితా మొగ్గలు వికసిస్తున్నాయి. వాట్సాప్ సమూహాలలో రాసే కవులందరూ ఈ ఫేస్‌బుక్ సమూహాలలో తమ మొగ్గలను రాస్తున్నారు. మొగ్గల సృష్టికర్త భీంపల్లి శ్రీకాంత్ రాసిన అనేక మొగ్గలు నిత్యం ఫేస్‌బుక్‌లో వికసిస్తూనే ఉంటాయి. మాట గురించి రాసిన ఈ మొగ్గను చూడండి.

పలకరింపు వానజల్లులా కురిస్తేనే కదా
చిరునవ్వులు పులకరించి మొలకెత్తేది
మంచిమాట మనిషిగా మార్చే పూలతోట

చక్కని పలకరింపులే మానవ సంబంధాలకు బాటలు వేస్తాయి. చిరునవ్వులే ఎదుటి మనిషిని ఆకర్శిస్తాయి. మంచి మాట మనిషిని ఎపుడూ మనిషిగా మారుస్తాయన్న ధ్వని ఈ మొగ్గలో ప్రతిఫలించింది.

ప్రముఖ కవయిత్రి పులి జమున దాంపత్య మొగ్గలు రాస్తూ వివాహబంధాన్ని చక్కగా ఆవిష్కరించింది.

అనురాగబంధంగా మలుచుకుంటేనే కదా
ఏడడుగుల బంధం ఎల్లకాలం నిలిచేది
ఆలుమగల బంధం అనురాగ సంగమం

ఆలుమగల దాంపత్యాన్ని చక్కగా ఆవిష్కరించిన మొగ్గ ఇది. ఏడడుగుల బంధానికి చక్కని పూనిక ఇది.

మరో కవయిత్రి పుష్పలత రాసిన పలు మొగ్గలు ఆలోచింపచేస్తాయి.

గాయమై గుండె రగిలితేనే కదా
గేయం కవిత్వమై కురిసేది
సాహిత్యం కురిసే అగ్నిపూలవాన

కవి గుండె గాయపడితేనే గేయం ఆవిష్కృతమవుతుంది. కవిత్వం అగ్ని పూల వర్షాన్ని కురిపిస్తుంది. చక్కని భావసంపద కుదిరిన మొగ్గ ఇది.

మరో యువకవి సైదులు ఖేతావత్ నిత్యం మొగ్గలను రాస్తూ వికసింపజేస్తున్నాడు. కలం మీద రాసిన మొగ్గలు అతని ఆలోచనా శక్తిని తెలియచేస్తాయి.

కలాల గొంతు నొక్కాలని చూస్తున్నప్పుడల్లా
సవరించుకుని యుద్ధ భేరిని మోగిస్తున్నాయి
కవి కలాల నాదం సమరశంఖ నినాదం

కవి కలం నిరంతర స్రవంతి. కాలంతో పయనించే దిక్సూచి. ఎన్ని కలాలని అణగదొక్కాలని చూసినా అది తన జూలు విదిలిస్తూనే ఉంటుంది. కవి కలం సమరశంఖాన్ని పూరించే గాండీవం అనే గొప్ప అభివ్యక్తిని కవి చాటాడు.

మరో కవయిత్రి ధనాశి ఉషారాణి ప్రతినిత్యం వివిధ అంశాలపై మొగ్గలు వికసింపజేస్తుంది. కార్మికుని గురించి రాసిన మొగ్గలు ఆలోచింపజేస్తాయి.

అతడు పంట పొలలో రక్తాన్ని ధారవోస్తేనే కదా
పచ్చని పైరులు పండుగలా భువిపై విరిసేది
రత్నరాశులను పొంగించే నిత్య నేర్పరి కార్మికుడు

నిత్యం పనిచేయడమే కార్మికుని విధి. లోకంలో ఎక్కడైనా కార్మికుడు లేకపోతే ఏ పని కాదన్నది నిజం. ప్రగతి కుంటుపడుతుం దన్నది పచ్చి నిజం.

దార్ల రాఘవేంద్రాచారి రాసిన కాలపు మొగ్గలు కాలాన్ని చిత్రికపడతాయి. ఆరు రుతువులతో కాసిన మొగ్గలు కవితా మాధుర్యాన్ని పంచుతాయి.

ప్రకృతినిండా విరగబూసిన కుసుమాలే
ఇంటింటా వెలిగే నవ్వులవుతాయి
వసంతం కురిసే మానవతా పరిమళం

వసంతం ప్రకృతిలో విరబూసే పరిమళం. వసంతం వచ్చిందంటే మదినిండా ఆనందాల వెల్లువలే. అలాంటి వసంతం నిత్యమై వెలగాలంటాడు కవి. ఇంకా చాలా మంది మొగ్గల కవులు ఫేస్‌బుక్‌లో మొగ్గలను విరివిగా వికసింపజేస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్

వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలతో పాటు కవులు ఇస్టాగ్రామ్‌లో కూడా మొగ్గలు రాస్తున్నారు. ప్రముఖ యువకవి ఉర్సురాజ్ మానస వివిధ అంశాలపై రాసిన మొగ్గలను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేస్తున్నాడు. బడి గురించి రాసిన మొగ్గలు బాల్యాన్ని చక్కగా ఆవిష్కరిస్తాయి.

బాల్యం బంగారుమయమైతేనే కదా
భవిష్యత్ పూలవనమై పురివిప్పేది
పసిడికాంతుల వన్నెలాడి బాల్యం

బాల్యం బంగారమైతేనే భవిష్యత్ పూలవనమవుతుందన్న కాంక్ష ఈ మొగ్గలో చక్కగా అమిరింది. పసిడి కాంతులను వెదజల్లే వన్నెలాడి బాల్యమంటూ కీర్తిస్తాడు.

ప్రముఖ యువకవి యెలిశాల నాగమోహన్ అనేక మొగ్గలను ఆవిష్కరించాడు.

పలకరింతలు పూలపరిమళాలైనప్పుడే కదా
మోములు చిరునవ్వుల వికసిత పుష్పాలయ్యేది
తియ్యని పలకరింతే మనసుకు కదలిక

పలకరింతలే మనిషిని కదిలించేవి. అలాంటి పలకరింతలు పూలపరిమాళాలైతేనే హృదయ సీమలను గెలుచుకునేది. మంచి పలకరింత మనిషిని కదిలించేదిగా ఉంటేనే దానికి సార్థకం. ఇటువంటి అనేక మొగ్గలు ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా వికసిస్తున్నాయి.

అంతర్జాల పత్రికలు

అంతర్జాల సౌకర్యం వచ్చినంక ప్రతి ఒక్కరు తమ కవితలను అంతర్జాలంలో నిరంతరాయ ంగా పోస్ట్ చేస్తున్నారు. తెలుగు కవిత్వం కూడా అంతర్జాలంలో నిత్యం వికసిస్తూనే ఉంది. అంతర్జాలంలో అనేక తెలుగు పత్రికలున్నాయి. విహంగ, నవ్య మీడియా వంటి ఆన్‌లైన్ పత్రికలలో మొగ్గలు వస్తున్నాయి. అంతే కాకుండా ప్రముఖ యువకవి అఖిలాశ ప్రారంభించిన ప్రతిలిపి అనే ప్రత్యేక యాప్‌లో కూడా మొగ్గలు నిరంతరాయంగా వస్తున్నాయి.

ఇలా మొగ్గలు అనేక సామాజిక మాధ్యమాలలో మొగ్గతొడుగుతూ కవితా పరిమళాలను వెదజల్లుతున్నాయి. తెలుగు సాహిత్యంలో నూతనంగా ఆవిర్భవించిన ఈ మొగ్గలు నిత్యం కాస్తూ, వికసిస్తూ వచన కవితా మాగాణంలో మొగ్గల పంటై పండుతున్నాయి. మొగ్గలు మొదటగా విత్తై మొలకెత్తి మొగ్గ తొడిగింది. ఇపుడు మొగ్గలు నిత్యం కవితా పరిమళాలను వెదజల్లుతున్నాయి. ఎంతోమంది నూతన కవులు, ప్రముఖ కవులు మొగ్గలుకు ప్రాణం పోస్తూ చిరంజీవిని చేస్తున్నారు. వారందరికీ అభినందనలు.

**-డా.భీంపల్లి శ్రీకాంత్**
9032844017

వేదలికం కొమ్మ .. తన ఆకలి తీర్చుకుంది
బరువు మోయలేని బతుకులు
మరణశాసనాలు రాసుకున్నాయి .. దీనంగా
చిక్కుముడి విప్పకోలేని దుఃఖిత జీవితాలు
విప్పకోలేని ముడివేసుకుని
మహాశూన్యంలో జారుకున్నాయి .. నిశ్శబ్దంగా !

- కెరె జగదీష్





ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి రచించిన "అంతర్వాహిని' గ్రంథాన్ని ఆగష్టు 5న కరీంనగర్‌లో సాహితీ గౌతమి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి, చిత్రంలో ఇస్రత్ సుల్తానా, గజేందర్‌రెడ్డి, నంది శ్రీనివాస్, డా॥కె. రామకృష్ణ, గాజుల రవీందర్, గంద్ర లక్ష్మణరావు, ఎం.వి. నర్సింహారెడ్డి, అనుముల దయాకర్ తదితరులు. ◯ వేదికపై ప్రసంగిస్తున్న డా॥నందిని సిధారెడ్డి.

## స్నేహ గీతం

జీవితంలో మధురమైనది
స్నేహమేరా! స్నేహమే!
జీవనంలో మరువలేనిది
స్నేహమేరా! స్నేహమే! ॥జీ॥

శరత్కాలపు చంద్రికల్లా
పలకరించును స్నేహమే!
వన్నె వన్నెల వసంతంలా
పరిమళించును స్నేహమే!..

ఆ స్నేహమే ఒక అమని!
ఆ స్నేహమే ఒక మధువని! ॥జీ॥

-డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699



డా॥ దాశరథి, సి. నారాయణరెడ్డిల జయంతి ఉత్సవాల సందర్భంగా రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సోమవారం రాత్రి భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో చైతన్యప్రసాద్, వడ్డేపల్లి కృష్ణలకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య. చిత్రంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ డా॥నందిని సిధారెడ్డి, గుండు సుధారాణి, సుధామ, పి. మధుసూదన్‌రావు, వై.కె.నాగేశ్వరరావు.